తెలంగాణ తిరోగమనం

- అనుభవరాహిత్యం, అసమర్థతతో అన్నిరంగాల్లో రాష్ట్రం వెనుకబాటు
- రవాణా ఆదాయం నిరుడు కంటే కిందికి
- రేవంత్‌రెడ్డివి బెదిరింపు రాజకీయాలు
- తనలానే అందరూ జైలుకెళ్లాలని కక్ష
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ): పదేండ్ల కేసీఆర్ పాలనలో అద్భుతంగా పురోగమించిన తెలంగాణ, అవినీతి, అసమర్థత, అనుభవరాహిత్యం కలగలిసిన రేవంత్‌రెడ్డి పాలనలో అన్ని రంగాల్లో తిరోగమిస్తున్నదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదివారం ఎక్స్ వేదికగా విమర్శించారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి రవాణా శాఖ ఆదాయం ఒక ముఖ్యమైన సూచీ అని, ప్రజల ఆర్థిక పరిస్థితులు బాగుంటే బైకులు, కార్లే కాకుండా ఇతర భారీ వాహనాల అమ్మకాలు, రిజిస్ట్రేషన్లు వృద్ధి సాధిస్తాయని వెల్లడించారు. కానీ తెలంగాణలో మాత్రం రిజిస్ట్రేషన్లు తగ్గి, ఆదాయం తిరోగమనంలో ఉన్నదని, పొరుగున ఉన్న ఐదు రాష్ట్రాలు ఈ ఏడాది రవాణా శాఖ ఆదాయంలో 8 శాతం నుంచి 32 శాతం వృద్ధిని నమోదు చేశాయని తెలిపారు. తెలంగాణ ఒక్కటే నిరుడు కంటే తక్కువ వృద్ధిని నమోదు చేయడం రాష్ట్రంలోని విఫల ప్రభుత్వ పనితీరుకు అద్దం పడుతున్నదని విమర్శించారు. పాలనను గాలికొదిలేసి కక్ష సాధింపు చర్యలకే పూర్తి సమయం కేటాయిస్తే ఫలితాలు ఇలా గాక మరెలా ఉంటాయని సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు.

ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారు?

డబ్బు సంచులతో రెడ్ హ్యాండెడ్‌గా దొరికి జైలుకెళ్లొచ్చిన రేవంత్‌రెడ్డి, తనలానే అందరూ జైలు జీవితాన్ని అనుభవించాలని కోరుకుంటున్నారని కేటీఆర్ ఎద్దేవాచేశారు. ఈ మేరకు ఓ నేషనల్ మీడియాకు ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూలో రేవంత్ వ్యాఖ్యల వీడియోను ఎక్స్‌లో షేర్ చేశారు. ఓ ప్రభుత్వ పథకం ద్వారా తమ సంస్థపై ప్రభావం పడే అవకాశం ఉన్నదని అభిప్రాయపడ్డందుకు ఎల్అండ్‌టీకి చెందిన సీఎఫ్‌వోను జైలుకు పంపిస్తామని బెదిరిస్తున్నారని మండిపడ్డారు. ప్రతిష్ఠాత్మకమైన సంస్థను నిర్మోహమాటంగా బెదిరించడం మూర్ఖత్వమని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇలాంటి పనికిమాలిన ప్రకటనలతో పారిశ్రామిక వర్గాలకు ఏం సందేశమివ్వాలనుకుంటున్నారని ప్రశ్నించారు. పెట్టుబడులను ఆకర్షించడానికి మీరు అనుసరిస్తున్న వ్యూహం ఇదేనా? అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని నిలదీశారు.

సీపీఎస్ టీఈఏ ఎమ్మెల్సీ అభ్యర్థిగా మధుబాబు

హైదరాబాద్, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ): వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉమ్మడి జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థిని కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ టీచర్స్ అండ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (సీపీఎస్ టీఈఏ) ప్రకటించింది. తమ అభ్యర్థిగా పంతులు మధుబాబును బరిలో దించనున్నట్టు సీపీఎస్ టీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు దాముక కమలాకర్ ఆదివారం ప్రకటించారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో మధుబాబు అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారు. ఈ సందర్భంగా మధుబాబు మాట్లాడుతూ సీపీఎస్ రద్దు, పాత పెన్షన్ సాధనకు తాను ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి, ఎమ్మెల్సీగా పోటీచేస్తున్నట్టు తెలిపారు. ఉపాధ్యాయులంతా తనను గెలిపించాలని కోరారు.

పాట ఉన్నన్ని రోజులు గద్దర్ సజీవం

- అర్ధ శతబ్దాపు పోరాటయోధుడు గద్దర్
- జీవిత చరిత్రను డాక్యుమెంటరీ చేయాలి
- సిద్దిపేటలో గద్దర్ విగ్రహం ఏర్పాటు చేస్తాం
- మాజీ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట పీపుల్స్ కాన్ఫరెన్స్‌లో గద్దర్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యే రసమయి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, కవి గాయకుడు నందిని సిధారెడ్డి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య తదితరులు

సిద్దిపేట, డిసెంబర్ 15: గద్దర్ లేని ఉద్యమం లేదని, ఆయన అర్ధ శతాబ్దపు పోరాటయోధుడని, పాట ఉన్నంత కాలం గద్దర్ సజీవంగా ఉంటారని మాజీ మంత్రి హరీశ్‌రావు కొనియాడారు. ఆదివారం సిద్దిపేట పట్టణంలోని విపంచి కళానిలయంలో గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'పీపుల్స్ కాన్ఫరెన్స్.. ప్రజా యుద్ధనౌక గద్దరన్న' సాహిత్య పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, కవి, గాయకుడు నందిని సిధారెడ్డి, గద్దర్ కుమారుడు సూర్యతో కలిసి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ పదవులకోసం ఆశ పడకుండా తన తండ్రి పోరాటాన్ని, చరిత్రను రేపటి భావితరానికి అందించేందుకు సూర్యం మంచి ప్రయత్నం చేశారని అభినందించారు.

ఐదు దశాబ్దాల్లో జరిగిన ప్రతి పోరాటంలో గద్దర్ ఉన్నాడని, విప్లవోద్యమం, తెలంగాణ ఉద్యమం, దళిత ఉద్యమం ఇలా ప్రతి దాంట్లో న్యాయం వైపున నిలిచి అన్యాయాన్ని ప్రశ్నించాడని, మలిదశ ఉద్యమంలో గద్దర్ అన్నను కలిసే అదృష్టం కలిగిందని తెలిపారు. గద్దర్ ఒక్క పాట 100 ఉపన్యాసాల సారాంశమని, చాలా సామాన్య పదాలతో ప్రజల హృదయాల్లోకి చేరేలా ఆయన పాటలు పాడేవారని గుర్తుచేశారు. మలి దశ తెలంగాణ ఉద్యమంలో 'పొడుస్తున్న పొద్దుమీద' పాట తెలంగాణ ఉద్యమాన్ని, సమాజాన్ని ఉర్రూతలూగించి ప్రజల్లో చైతన్యం తెచ్చిందన్నారు. 2008లో తెలంగాణ కోసం రాజీనామా చేసిన టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎంపీలపై తెలంగాణ ఐక్య కార్యాచరణ సమితి అభ్యర్థులను పెట్టాలని నిర్ణయిస్తే అది తప్పని వాదించిన వ్యక్తి గద్దర్ అని, అవసరమైతే తాను ప్రచారం చేసి గెలిపిస్తానని చెప్పిన వ్యక్తి గద్దర్ అని తెలంగాణ ఉద్యమానికి, కేసీఆర్‌కు గద్దర్ అండగా నిలిచారని గుర్తుచేశారు.

గద్దర్ ఆలోచనలను ముందుకు తీసుకెళ్లాలి

తూప్రాన్ మాటిక చెరువులో నీళ్లులేవని, హల్దీ వాగులోంచి మాటిక చెరువులోని నీటిని లిఫ్ట్ చేయాలని గద్దర్ కోరితే 8 నెలల్లో పూర్తి చేసి ఆయనతోనే ప్రారంభింపజేశామని హరీశ్‌రావు తెలిపారు. తెలంగాణ వచ్చాక జీహెచ్‌ఎంసీ మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు అమలు కావడం లేదని గద్దర్ లెటర్ రాస్తే వెంటనే ఒక్క సంతకంతో కేసీఆర్ జీతాలు పెంచారని, అది గద్దర్‌కు కేసీఆర్ ఇచ్చిన గౌరవమని తెలిపారు. 'సిద్దిపేటలో గద్దర్ విగ్రహం పెట్టడం మాకు చాలా గౌరవం.. దాన్ని ఏర్పాటు చేయించే బాధ్యత నాది' అని చెప్పారు. గద్దర్ జీవిత చరిత్రపై డాక్యుమెంటరీ చేయాలని అందుకు తాను సహకారం అందిస్తానన్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లు అవుతున్నా ఇంకా సమాజంలో అసమానతలు ఉన్నాయని, అవి చెరిగిపోవాలంటే గద్దర్ ఆలోచనలను ముందుకు తీసుకెళ్లాలని, ఎప్పటి వరకు ప్రభుత్వం ప్రజల ఆలోచలను తీసుకెళ్లదో.. అణచివేస్తూ ఉంటదో అక్కడ ప్రభుత్వ అవార్డులకు అర్థం లేదు అనే మాట గద్దర్ చెప్పారని గుర్తుచేసుకున్నారు. తన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు తెలంగాణ తల్లి చేతిలో బతుకమ్మను మాయం చేసిన రేవంత్‌రెడ్డి అవార్డు ఇస్తే త్రుణప్రాయంగా తిరస్కరించిన నందిని సిధారెడ్డి సిద్దిపేట బిడ్డ కావడం నిజంగా గర్వకారణమని కొనియాడారు. త్వరలోనే గద్దర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకొని భారీ బహిరంగ సభను సిద్దిపేటలో నిర్వహించుకుందామని చెప్పారు. కార్యక్రమంలో పోచబోయిన శ్రీహరి యాదవ్, శంకర్, ఆస శ్రీరాములు,సత్తయ్య, సిద్దెంకి యాదగిరి, ఆస లక్ష్మణ్, భీమసేన పాల్గొన్నారు.

మెదక్ జిల్లాకు గద్దర్ పేరు పెట్టాలి: రసమయి

మెదక్ జిల్లాకు గద్దర్ పేరు పెట్టాలని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అభిప్రాయపడ్డారు. గద్దర్ తరగని గని అని, ఆయన ఆశయాలు అనంతమని చెప్పారు. 2006లో మొదటిసారి తెలంగాణ కోసం జరిగిన ధూంధాంలో గద్దర్‌ను కలిశానని, మలి విడత సాంస్కృతిక ఉద్యమానికి గద్దర్‌ను తీసుకొచ్చామని గుర్తుచేశారు. కూటికి లేని తల్లిని గురించి ఆలోచించిన వ్యక్తి గద్దర్ అని, ప్రజల కోసం పాటలు రాసి ప్రజల కోసమే పాట పాడిన కవి గద్దర్ అని కొనియాడారు.

గద్దర్ పాట రాని తెలంగాణ వ్యక్తి లేడు: దేశపతి

గద్దరు పాట రాని తెలంగాణ వ్యక్తి లేడని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ చెప్పారు. ప్రజలను తన పాటలతో సాయుధులను చేసిన వ్యక్తి గద్దర్ అని కొనియాడారు. ప్రజాగర్జనకు.. ప్రజాపాటకు రాగం తాళం సమకూర్చితే అది గద్దర్ అని, రైతుకూలీల గుండెల్లో, కార్మికుల్లో కొండంత విశ్వాసాన్ని కల్పించిన వ్యక్తి గద్దర్ అని, తెలంగాణలో భూమికోసం భూకంపం సృష్టించిన వ్యక్తి గద్దర్ అని, కోటానుకోట్ల ప్రజా సమూహాన్ని కదిలించిన కవి గద్దర్ అని కొనియాడారు.

పాటల ప్రపంచం గద్దర్: నందిని సిధారెడ్డి

పాటల ప్రపంచం గద్దర్ అని, ఆయన పుస్తకాన్ని సిద్దిపేటలో ఆవిష్కరించుకోవడం తనకు జీవితాంతం గుర్తుండిపోతుందని ప్రముఖ కవి నందిని సిధారెడ్డి చెప్పారు. గద్దర్‌తో తనకు 50 ఏండ్ల అనుబంధం ఉన్నదని, ప్రజల పాటలకు సంప్రదాయాన్ని ఇచ్చిన కవి గద్దర్ అని గుర్తుచేశారు. వరంగల్లో 10 లక్షల మందితో నిర్వహించిన రైతు కూలీ సభను తన పాటలతో అలరించిన గొప్ప గాయకుడు గద్దర్ అని, ఆయనతో పోల్చగలిగిన కవి లేడని తెలిపారు.

గొప్ప సాహిత్య వేత్త గద్దర్: వెంకటయ్య

అంబేద్కర్ తర్వాత దళితుల్లో అంతటి మేధావి గద్దర్ మాత్రమేనని ఎస్సీ, ఎస్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ బక్కి వెంకటయ్య కొనియాడారు. సిద్దిపేటలో గద్దర్ విగ్రహ ఏర్పాటుకు తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు. హరీశ్‌రావు ఇరిగేషన్ మంత్రిగా ఉన్నప్పుడు హల్దీ వాగుపై లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు మంజూరు చేయించి గద్దర్‌తోనే శంకుస్థాపన చేయించారని గుర్తుచేశారు.

రేవంత్ ఫెయిల్యూర్ సీఎం

ఢిల్లీ పెద్దల మీదున్న ధ్యాస విద్యార్థులపై లేదు • మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ): రేవంత్‌రెడ్డి ఫెయిల్యూర్ సీఎం అని మాజీమంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఫుడ్ పాయిజన్‌తో దవాఖానల్లో చికిత్స పొందుతున్న విద్యార్థుల కథనాలను జతచేసి ఆదివారం ఆయన ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి ఢిల్లీ పెద్దల మీదున్న ధ్యాస గురుకులాల్లో అవస్థలు పడుతున్న విద్యార్థులపై లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ పాలనలో విద్యార్థుల ప్రాణాలకు భరోసా లేదని, పిల్లల ప్రాణాలు పోతున్నా సర్కార్ పట్టించుకోకపోవడం దారుణమని మండిపడ్డారు.

కేసీఆర్‌కు టీపీసీసీ చీఫ్ లేఖ

హైదరాబాద్, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపణలు మానుకోవాలని మాజీ సీఎం కేసీఆర్‌కు టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ ఆదివారం బహిరంగ లేఖ రాశారు. ప్రభుత్వంపై బీఆర్‌ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలపై స్పష్టత ఇచ్చే దిశలో తాను లేఖ రాస్తున్నట్టు వివరణ ఇచ్చారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నట్టు లేఖలో వివరించారు.

గ్లోబల్ సిటీని గాలికొదిలిన సీఎం

- బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ పాలనలో గ్లోబల్ సిటీగా ఎదిగిన హైదరాబాద్‌ను ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి గాలికొదిలేశారని బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. ఏడాదిలో ఒక్క అభివృద్ధి పని మొదలుపెట్టని ఆయన.. హైడ్రా పేరిట దోపిడీ చేస్తున్నారని ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు.

పీసీసీ చీఫ్ ఓ పప్పెట్!

- సీఎంల పనితీరు బాగా లేకపోతే గతంలో పీసీసీ చీఫ్‌లు చెప్పేవారు
- రేవంత్ తప్పిదాలపై మహేశ్ నిలదీయాలి
- బహిరంగ లేఖ సీఎం రేవంత్‌కు రాయాలి.. బీఆర్‌ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌కు కాదు
- కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద
- మహేశ్‌గౌడ్ లేఖ చిత్తుకాగితంతో సమానం
- మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆగ్రహం

హైదరాబాద్, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ): టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ ఓ పప్పెట్ (ఆడించే బొమ్మ), డమ్మీ మాత్రమేనని బీఆర్‌ఎస్ నేత, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద విమర్శించారు. ముఖ్యమంత్రుల పనితీరు బాగాలేకపోతే గతంలో పీసీసీ అధ్యక్షులు బహిరంగంగానే చెప్పేవారని, సలహాలు, సూచనలు ఇచ్చేవారని గుర్తుచేశారు. మహేశ్‌గౌడ్ ఏదైనా లేఖ రాయాల్సివస్తే సీఎం రేవంత్ తప్పిదాలపైనా, ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీల అమలుపై రాయాలని హితవు పలికారు. కేసీఆర్‌కు పీసీసీ చీఫ్ బహిరంగ లేఖ రాయడంపై మండిపడ్డారు. రేవంత్‌రెడ్డికి రాసిన లేఖను కేసీఆర్‌కు పంపారనే అనుమానం కలుగుతున్నదని ఎద్దేవా చేశారు. తెలంగాణభవన్‌లో ఆదివారం మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. పీసీసీ అధ్యక్షుడికి కూడా సీఎం రేవంత్‌రెడ్డి అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని, ఇలా కేసీఆర్‌కు లేఖ రాయడం వల్ల పట్టించుకుంటారేమోనని ఆశపడుతున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణ ఇవ్వలేదని, కేసీఆర్ నేతృత్వంలో సాధించామని ప్రజలు భావిస్తున్నారని, సోనియా తెలంగాణ ఇచ్చారని ప్రజలు నమ్మితే 2014, 2018లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేదని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఆత్మ బలిదానాలకు కారణం కాంగ్రెస్ నేతలేనని, రేవంత్‌రెడ్డి పేరు రాసి కూడా కొందరు బలిదానం చేసుకున్నారని గుర్తుచేశారు. రేవంత్ తప్పిదాల కారణంగా కాంగ్రెస్ మరో ఇరవై ఏండ్లు అధికారానికి దూరమయ్యే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చింది కేసీఆర్ అన్న విషయం మహేశ్ తెలుసుకోవాలని సూచించారు. ఆర్థిక రంగంపై అబద్ధాలు ప్రచారం చేస్తున్న పీసీసీ చీఫ్ ఆర్‌బీఐ హ్యాండ్‌బుక్‌ను చదువుకోవాలని, తలసరి ఆదాయంలో తెలంగాణ అగ్రభాగాన ఉండేలా చేసింది కేసీఆర్‌యేనని చెప్పారు. రుణమాఫీ 25 లక్షల మందికి కూడా పూర్తి కాలేదని, ఘట్‌కేసర్‌లో ప్రాథమిక సహకార సొసైటీలో ఒక్క రైతుకు కూడా రుణ మాఫీ కాలేదని స్పష్టంచేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను మీడియాకు చూపించారు. ముందు పీసీసీ అధ్యక్షుడు సీఎంతో మాట్లాడి మాఫీ అయ్యేట్టు చూడాలని, డమ్మీ పీసీసీ ప్రెసిడెంటా? అసలైన ప్రెసిడెంటా అనేది రుణ మాఫీ చేయించి చూపించాలని చాలెంజ్ విసిరారు. ఆరు గ్యారెంటీల అమలు ఏమైందో పీసీసీ ప్రెసిడెంట్ చెప్పాలని, మహాలక్ష్మి పథకం కింద మహిళలకు నెలకు రూ. 2500 ఎప్పటి నుంచి ఇస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి సంకుచిత మనస్తత్వం గురించి మహేశ్‌గౌడ్ మాట్లాడాలని సూచించారు. సీఎం రేవంత్ తన శాడిస్టు ధోరణితోనే అల్లు అర్జున్‌ను అరెస్టు చేయించారని, చట్టం తన పని తాను చేస్తుందంటున్న సీఎం.. కొండారెడ్డిపల్లిలో చట్టం తన పని ఎందుకు చేయడం లేదని నిలదీశారు.

రేవంత్ మెప్పు కోసమే లేఖ

సీఎం రేవంత్‌రెడ్డి మెప్పు కోసమే పీసీసీ చీఫ్ కేసీఆర్‌కు లేఖ రాశారని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ విమర్శించారు. ఆయన లేఖ చిత్తు కాగితంతో సమానమని అన్నారు. వేరే పార్టీ నుంచి వచ్చి పార్టీని నాశనం చేస్తున్న రేవంత్ తీరును ప్రశ్నించాలని, కాంగ్రెస్‌ను బొంద పెట్టొద్దని కోరుతూ లేఖ రాయాలని సూచించారు. కేసీఆర్‌కు లేఖ రాస్తే రేవంత్‌రెడ్డి దగ్గర పరపతి పెరుగుతుందని మహేశ్‌గౌడ్ ఆశపడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో, డిక్లరేషన్లలో ఇచ్చిన హామీల అమలు ఎప్పుడో అని సీఎంకు లేఖ రాయాలని సూచించారు. అసెంబ్లీ, మండలి సమావేశాలు నెల రోజులు జరపాలని రేవంత్‌కు లేఖ రాయాలని మహేశ్‌గౌడ్‌కు సూచించారు. తెలంగాణ సమస్యలపై అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్‌ఎస్ శాసన సభాపక్షం గట్టిగా పోరాడుతుందని చెప్పారు. తెలంగాణ సంస్కృతి గురించి అసలు రేవంత్, మహేశ్‌గౌడ్‌కు తెలుసా? తెలంగాణ తల్లి నుంచి బతుకమ్మను మాయం చేస్తారా? అని ప్రశ్నించారు. కేటీఆర్, హరీశ్‌రావు, కవిత ఉద్యమంలో పాల్గొన్నప్పుడు మహేశ్ ఎక్కడ ఉన్నారని నిలదీశారు.

రాజన్న కోడెలను కోతకివ్వడం దారుణం

- దేవుడి సొమ్మునూ దోచేస్తున్న పాలకులు!
- ఓ సొసైటీకి 60 కోడెలివ్వాలన్న మంత్రి సురేఖ
- ఆమెను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలి
- ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి
- నిందితులపై పీడీ యాక్ట్ కేసు నమోదు చేయాలి
- మీడియాతో బీఆర్‌ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ): భక్తులు ఎంతో పరమభక్తితో వేములవాడ రాజన్నకు సమర్పించిన కోడెలను కోతకు అమ్ముకోవడం అత్యంత దారుణమని బీఆర్‌ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి విమర్శించారు. ప్రజల సొమ్ముకు ధర్మకర్తలుగా ఉండాల్సిన ప్రభుత్వం, మంత్రులు ఆఖరికి దేవుడి సొమ్మును కూడా దోచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. హైదరాబాద్ తెలంగాణభవన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ ఒక సొసైటీకి 60 కోడెలను ఇవ్వాలని ఆదేశాలిచ్చారని, మంత్రే కబేళాలకు తరలించడానికి సహకరించినట్టు స్పష్టంగా ఆధారాలు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆ ఆదేశాల కాపీని మీడియాకు చూపించారు. సురేఖ చేసిన ఈ పాపం కాశీకి పోయినా పోదని, దొంగలకు సద్దులు మోస్తూ ధర్మాన్ని అవహేళన చేస్తున్నారని విమర్శించారు. తక్షణమే ఆమెను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని, లేదా నైతిక బాధ్యత వహిస్తూ ఆమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. వేములవాడ రాజన్న కోడెల తరలింపుపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, నిందితులపై పీడీ యాక్ట్ నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. దేవుడి మీద ఒట్లు, దేవుడి సంపదకు తూట్లు ఇది కాంగ్రెస్ పార్టీ విధానంగా మారిందని ధ్వజమెత్తారు. గొప్పగా బాగు చేయకున్నా, వరంగల్ ఇజ్జత్ మాత్రం తీయవద్దని మంత్రికి హితవు పలికారు. వేములవాడలో కోడెను ఇస్తే కొండా సురేఖకు పోతయట కదా.. అనే నానుడి వచ్చిందని మండిపడ్డారు. కాంగ్రెస్ విజయోత్సవ సభకు రాజన్న సొమ్మును రూ.2 కోట్లు వాడుకున్న ఘటనపైనా విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

ప్లేటు భోజనం 32 వేలు?

మొదటిపేజీ తరువాయి...

చెందిన హోటల్ తాజ్‌కృష్ణ నిర్వాహకులు ఆలయ అధికారులకు పంపిన బిల్లు ఇది. భోజనాలతోపాటు పట్టుపంచెలు, ఇతర మర్యాదల కోసం పెట్టిన మొత్తం ఖర్చు సింపుల్‌గా రూ.కోటీ 70 లక్షలు! ఇంత బిల్లు చెల్లించడం తమ వల్ల కాదని రాజన్న ఆలయ అధికారులు చెప్తుండగా, ఈ 'పేమెంట్ చేయాల్సిందే'నంటూ రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ఒక ఉన్నతాధికారి ఒత్తిడి తెస్తున్నట్టు సమాచారం. దీంతో దిక్కుతోచని ఆలయ అధికారులు ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిసింది. నిత్యం కడుపు కాల్చుకొని పైసాపైసా కూడబెడుతున్నామని పదేపదే చెప్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ ఖర్చుపై ఎలా స్పందిస్తారో మరి.

ఆలయ నిబంధనలూ మంట గలిపారు!

ప్రజాపాలన విజయోత్సవాల పేరిట గత నెల 20న వేములవాడలో కాంగ్రెస్ ప్రభుత్వం బహిరంగ సభ నిర్వహించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు పలువురు మంత్రులు వేములవాడకు వచ్చారు. వీరితోపాటు ఇతర వీఐపీలకు అధికారిక లాంఛనాలతో స్వాగతం పలికిన అధికారులు ఆ తర్వాత రాజన్న దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా వంద మంది వీఐపీలకు భోజనాలు పెట్టేందుకు హైదరాబాద్ నుంచి తాజ్ హోటల్ సిబ్బంది వచ్చారు. దేవస్థానం చైర్మన్‌కు చెందిన చాంబర్‌నే ఫైవ్‌స్టార్ హోటల్‌గా మలిచి అక్కడే వండి భోజనాలు పెట్టారు. అందులోకి మీడియాను అనుమతించలేదు. కేవలం ఎంపికచేసిన వీఐపీలు మాత్రమే వెళ్లారు. దేవాలయానికి ఆనుకొని ఉన్న చైర్మన్ చాంబర్‌ను ఒక హోటల్‌గా మార్చడం నిబంధనలకు విరుద్ధం. సదరు హోటల్ నిర్వాహకులు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం పెట్టారు. మొత్తం వంద మంది వీఐపీలకు వంట చేసి భోజనాలు పెట్టినట్టు చెప్పిన సదరు హోటల్ యాజమాన్యం, అందుకు సంబంధించిన బిల్లులను తాజాగా రాజన్న ఆలయ ఈవోకు పంపినట్టు ఆలయ అధికారుల ద్వారా తెలిసింది. అందులో భోజనం ఖర్చు రూ.17 లక్షలు, ట్రాన్స్‌పోర్ట్, వెయిటర్, భోజనాల కోసం వేసిన డెకరేషన్ ఖర్చులు కలిపి రూ.15 లక్షలుగా పేర్కొన్నది. వంద మంది భోజనాల ఖర్చు కింద రూ.32 లక్షలు చెల్లించాలని పేర్కొంటూ బిల్లులు పంపారనేది అత్యంత విశ్వసనీయ సమాచారం. అంటే ట్రాన్స్‌పోర్ట్ ఖర్చులతో కలిపి చూస్తే ఒక్కో వీఐపీ ఆ రోజు చేసిన భోజనం ఖరీదు రూ.32 వేలు అన్నమాట!

10 వేలతో పట్టు పంచెలు?

సాధారణంగా ముఖ్యమంత్రితోపాటు ఇతర మంత్రులు వచ్చినప్పుడు.. దేవాదాయ శాఖ కొన్ని సంప్రదాయాలు పాటించాల్సి ఉంటుంది. ఇక్కడ అది శ్రుతి మించింది. తొలుత ముఖ్యమంత్రికి రూ.పది వేల విలువైన పట్టుపంచె, మంత్రులు, ఇతర వీఐపీలకు అంత కంటే తక్కువ ఖర్చుతో పట్టుపంచెలను తెప్పించినట్టు తెలిసింది. కానీ, జిల్లాకు చెందిన ఒక ఉన్నతాధికారి జోక్యం చేసుకొని, ముఖ్యమంత్రి తరహాలోనే మంత్రులకు, వీఐపీలకు కూడా పట్టుపంచెలు పెట్టాలని హుకుం జారీ చేయడంతో ఆలయ అధికారులు అప్పటికప్పుడు అదే ధరతో కూడిన పట్టువస్త్రాలు తెప్పించినట్టు సమాచారం. అంతేకాదు, ముఖ్యమంత్రి వస్తున్నారని పేర్కొంటూ.. తాగే గ్లాస్ నుంచి తినే పల్లెం వరకు, కుర్చీ నుంచి టేబుల్ వరకు.. ప్రతి వస్తువు కొత్తది తెప్పించినట్టు విశ్వసనీయ సమాచారం. అందుకోసం సుమారు రూ.కోటి నలభై లక్షల వరకు వెచ్చించినట్టు తెలుస్తున్నది. అంటే ముఖ్యమంత్రి రాజన్న దర్శనానికి వచ్చిన సందర్భంగా భోజనాలు, ఇతర వస్తుల ఖరీదు కలసి రూ.కోటీ 70 లక్షలకుపైగా ఖర్చు పెట్టినట్టు సమాచారం. ఇవన్నీ బహిరంగ సభ వద్ద జరిగిన ఖర్చులతో సంబంధం లేకుండా కేవలం ఆలయ ప్రాంగణ పరిధిలో జరిగిన ఖర్చులు మాత్రమేనని తెలుస్తున్నది.

తెరపైకి పంచాయితీ?

భోజన బిల్లులు రూ.32 లక్షలు కావడంతో అసలు పంచాయితీ తెరపైకి వచ్చినట్టు సమాచారం. ఈ బిల్లులు రాజన్న ఆలయం నుంచి చెల్లిస్తారని ఒక ఉన్నతాధికారి చెప్పిన మేరకు హోటల్ యాజమాన్యం రాజన్న ఆలయ ఈవోకు బిల్లులు పంపించింది. అయితే భోజనాలకు ఇంత పెద్ద మొత్తంలో బిల్లులు చెల్లించడం తమ వల్ల కాదంటూ దేవాలయ అధికారులు తేల్చిచెప్పగా.. జిల్లాకు చెందిన ఒక ఉన్నతాధికారి 'లేదు.. లేదు. కచ్చితంగా చెల్లించాలి' అని ఆదేశించినట్టు తెలుస్తున్నది. ఆలయ అధికారులు మాత్రం ఆ బిల్లులు చెల్లించకుండా.. ఫైల్ తయారుచేసి రాజన్న సిరిసిల్ల కలెక్టర్‌కు పంపించినట్టు విశ్వసనీయ సమాచారం. ప్రస్తుతం అందుకు సంబంధించిన ఫైలు కలెక్టర్ వద్ద పరిశీలనలో ఉన్నది. ఈ బిల్లులు కలెక్టర్ తన ఖాతా నుంచి చెల్లిస్తారా? లేక తిరిగి రాజన్న ఆలయానికి పంపిస్తారా? అనే అంశంపై చర్చ నడుస్తున్నది. ముఖ్యమంత్రి రాక సందర్భంగా ప్రొటోకాల్ పాటించడం సహజమే అయినా ఏకంగా ఫైవ్ స్టార్ హోటల్‌నే దేవస్థానం పరిధిలోకి తెప్పించడం, లక్షల ఖర్చులతో భోజనాలు చేయడం ఎంతవరకు సమంజసమని దేవాలయ అధికారులే చర్చించుకుంటున్నారు. గతంలో అనేకమంది సీఎంలు వచ్చి వెళ్లారని, ఏనాడూ ఇటువంటి పరిస్థితి చూడలేదని ఆలయ వర్గాలు చెప్తున్నాయి. ఒక ఉన్నతాధికారి ఆదేశాల మేరకు అనుమతి లేకుండా కొనుగోలు చేసిన ఫర్నీచర్‌కు కూడా బిల్లులు ఎలా చెల్లించాలో అర్థం కావడం లేదని అధికారులు లోలోన మధనపడుతున్నట్టు తెలుస్తున్నది. మొత్తంగా ఈ సమస్య ఎటువైపు దారితీస్తుందోనన్న ఆందోళన రాజన్న ఆలయ ఉద్యోగుల్లో వ్యక్తం అవుతుండగా.. వంద మంది వీఐపీలకు ఏకంగా రూ.32 లక్షలు ఖర్చు పెట్టి భోజనాలు పెట్టడం అవసరమా? అని స్థానికులు చర్చించుకుంటున్నారు.